## క్లుప్తంగా

### ద్రౌపదీదేవికి విశేష పూజలు



**వెదురుకుప్పం:** మండలంలోని చవటగుంట శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మాఘ శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అభిషేక పూజల అనంతరం విశేషంగా అంలకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

### నాగాలమ్మ ఆలయంలో అన్నదానం



ఆలయంలో హోమ పూజలు

**గంగాధరనెల్లూరు:** తూగుండ్రం గ్రామంలోని నాగాలమ్మ ఆలయంలో మాఘ శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. గణపతి హోమం నిర్వహించారు. పొంగళ్లు పెట్టి నివేదించారు. మధ్యాహ్నం 300 మందికి అన్నదానం చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### బాల్య వివాహాలతో అనర్థాలు



**నగరి:** బాల్య వివాహాలతో అనర్థాలు చోటు చేసుకుంటాయని, చట్ట రీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. శుక్రవారం విజయపురం మండలం గంగమాంబపురం జెడ్పీ హైస్కూల్‌లో బాల్య వివాహాలు– అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు తెలిస్తే 1098 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం తెలిపి వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు గోవిందస్వామి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమతి, వైఎస్సార్ సీపీ నాయకుడు రవినాయుడు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్య పరిష్కారం



**వెదురుకుప్పం:** మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయతీ కిచ్చమనాయుడుపల్లె తాగునీటి సమస్యను సర్పంచ్ బి. పుష్ప పరిష్కరించారు. స్థానికుల వినతిపై స్పందించిన సర్పంచ్ గ్రామానికి వెళ్లి పంచాయతీ నిధులతో కొత్తగా పైప్‌లైన్ వేసి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


### అభివృద్ధి పనులకు సహకరించాలి



సూచనలిస్తున్న కమిషనర్

**పుత్తూరు రూరల్:** పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని కాపువీధిలో రూ.17 లక్షల అంచనా వ్యయంతో ప్రారంభించిన డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణం కోసం స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలన్నారు. గతంలో నిర్మించిన కాలువను పూర్తిగా ఆక్రమించి నిర్మాణాలు జరిగాయని, వీటిని వెంటనే తొలగించాలని కోరారు. లేనిపక్షంలో ఇప్పటికే పనులు ప్రారంభించిన నేపథ్యంలో తామే తొలగిస్తామని స్పష్టం చేశారు.

### బాధ్యతగా పనిచేయాలి



**శ్రీరంగరాజపురం:** మండలంలోని తయ్యూరు, పుల్లూరు సచివాలయాలను శుక్రవారం ఎంపీడీవో కృష్ణయ్య తనిఖీ చేశారు. రికార్డులను, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. రికార్డులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జూనియర్ లైన్‌మెన్ దినేష్ విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, తీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం 50 బసివిరెడ్డిపల్లె, అంకనపల్లె జగనన్న కాలనీలను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి, లబ్ధిదారులకు సూచించారు.

# రథసప్తమికి ముస్తాబు

**నగరి:** పట్టణ పరిధిలో టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీకరియమాణిక్యస్వామి ఆలయంలో శనివారం నిర్వహించనున్న రథసప్తమి కల్యాణోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఆలయ గోపురానికి ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ చేశారు. కోవిడ్ కారణంగా ఆగిన కల్యాణోత్సవ సేవలు రెండేళ్ల తర్వాత జరుగుతుండడంతో ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉంది. దీంతో గతంలో కంటే భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ టీటీడీ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ శనివారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం 9 గంటలకు శ్రీభూనీలా సమేత కరియమాణిక్యస్వామి వార్లకు తిరుమంజనం, ప్రత్యేక పూజలు. సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొన దలిచిన దంపతులు శనివారం మధ్యాహ్నం రెండు గంటల లోపు రూ. 500 చెల్లించి రశీదు పొందాలన్నారు దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గతంలో కంటే అధిక మోతాదులో ప్రసాదాలను తయారు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపను పొందాలని కోరారు.



నగరి: ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణ

#### నేడు రథ సప్తమి వేడుకలు

**కార్వేటినగరం:** కార్వేటినగరం ప్రసిద్ధ శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఆలయ అధికారి సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రథసప్తమిని పురస్కరించుకుని శనివారం వేకువ జామున సుప్రభాత సేవ, 4.30 నుంచి 5.30 మధ్య శుద్ధి, తోమాల, పంచాంగ శ్రవణం ఉంటుందన్నారు. 5.30 నుంచి 6 గంటల వరకు ఉత్సవర్ల సమర్పణ అనంతరం మూల విరాట్‌ను పట్టుపీతాంబరాలు, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య తిరువీధి ఉత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు.

#### లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో..

**గంగాధరనెల్లూరు:** వేపంజేరిలోని ప్రముఖ శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని, స్వామివారు సప్త వాహనపై పురవీధుల్లో దర్శనమిస్తారని ధర్మకర్త శ్రీధర్ తెలిపారు. వేకువజామున అభిషేకాది పూజలు, 7 గంటలకు సూర్యప్రభ వాహనం, 9గంటలకు శేషవాహనం, 11 గంటలకు అశ్వవాహనం, ఒంటిగంటకు హంస వాహనం, మధ్యాహ్నం 3 గంటలకు గరుడవాహనం, 5గంటలకు హనుమంత వాహనం, రాత్రి ఏడు గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీవారి విహారం ఉంటుందని పేర్కొన్నారు.

#### ఏర్పాట్లు పూర్తి

**నారాయణవనం:** మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సూర్య జయంతిని పురస్కరించుకుని శనివారం రథసప్తమి ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను తలపిస్తూ స్వామి వారు వరుసగా ఏడు వాహనాల్లో పుర వీధుల్లో విహరిస్తారని పేర్కొన్నారు. శనివారం వేకువ జామున నిత్య పూజలు, నైవేద్యం అనంతరం సూర్య ప్రభ, పెద్ద శేష, హంస, కల్పవృక్ష, చిన్నశేష, తిరుచ్చి వాహనపై స్వామివారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. సాయంత్ర కైంకర్యాలు అనంతరం 6.30 గంటలకు చంద్రప్రభ వాహనం సేవ జరుగుతుందని పేర్కొన్నారు.



కార్వేటినగరం ఆలయం వద్ద చలువ పందిరి



నారాయణవనం: ఊరేగింపునకు సిద్ధంగా..



కార్యక్రమంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

## ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

**నగరి:** థామస్‌ఆల్వా ఎడిషన్ బల్బు కనుగొన్న రోజును పురస్కరించుకుని గురువారం ఎలక్ట్రీషియన్ డేను ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. థామస్‌ఆల్వా ఎడిషన్‌కు జోహార్ చెబుతూ కేక్ కత్తిరించి పంచారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎస్సీ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ చీకటి ప్రపంచానికి వెలుగునిచ్చిన థామస్ ఆల్వాఎడిసన్ ప్రతి ఎలక్ట్రీషియన్‌కు ఆదర్శమన్నారు. ప్రమాదాన్ని లెక్కచేయక నిత్యం విద్యుత్ సంబంధిత వ్యవహారాల నడుమ ఎలక్ట్రీషియన్లు పనిచేస్తుంటారని తెలిపారు. ఎవరికి ఏ ఇబ్బంది తలెత్తినా అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. మండపం ప్రాంతంలో, దేశమ్మ దేవాలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. సభ్యులు ఎఎస్ రవి, కేపీ కుమార్, టీకేఎం శ్రీనివాసన్, ఎస్‌ఏ బాషా, టి.దామోదరం, జీఆర్ ప్రభు, ఎంఎస్ మురళి, జి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

## చెక్‌డ్యామ్ ధ్వంసం

**నగరి:** విజయపురం మండలం మహారాజపురం గ్రామానికి చెందిన శశ్మానగుంట వద్ద ఉన్న చెక్‌డ్యామ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇటీవల అధికారులు శశ్మానంలో గుంట తవ్వి, అందులోని నీరు బయటకు వెళ్లకుండ చెక్‌డ్యామ్ నిర్మించారు. గుంటలో వర్షకాలంలో నీరు నిలిచి అటు పశువులకు, ఇటు దహనక్రియలకు వచ్చేవారికి ఉపయోగకరంగా ఉంది. కొందరు రైతులు గురువారం రాత్రి తమ పొలాలకు వెళ్లడానికి అడ్డుగా ఉందని చెక్‌డ్యామ్‌ను ధ్వంసం చేశారు. దీనిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకుని చెక్‌డ్యామ్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



ధ్వంసమైన చెక్‌డ్యామ్

## నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు మెండు

**నగరి:** సబ్జెక్ట్‌పై పట్టుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్(నైపుణ్యాభివృద్ధి) పెంచుకోవడం ద్వారా ఉద్యోగాలు త్వరితగతిన సాధించవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వేణుగోపాల్ తెలిపారు. కళాశాలలో ఇంగ్లిషు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం కమ్యూనికేషన్స్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భాషపై పట్టు ఉంటనే పోటీ యుగంలో ఎక్కువ అవకాశాలు వస్తాయని తెలిపారు. విద్యార్థులు ఈ కోర్సు ద్వారా నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవచ్చని తెలిపారు. ట్రైనర్ డాక్టర్ ఎం.పంకజ మాట్లాడుతూ కోర్సు వ్యవధి 30 రోజులని, ఉద్యోగ అవకాశాలను పొందే విధంగా బోధన ఉంటుందన్నారు. ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి నాగార్జున, ఇంగ్లిష్ లెక్చరర్ లాల్ బాషా, జేకేసీ మెంటార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్


## రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక

**వడమాలపేట:** రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు వడమాలపేట బాలుర పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం భువనేశ్వరి తెలిపారు. శుక్రవారం తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా సబ్ జూనియర్స్ జూడో రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక జరిగినట్లు ఆమె వివరాలు వెల్లడించారు. భవిత(8వతరగతి) 36 కేజీలు, మన్సూర్ ఆలం(9వతరగతి) 60 కేజీలు, ఉదయ్‌కుమార్(8వతరగతి) 66 కేజీల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 3నుంచి కర్నూలు జిల్లాలో జరిగే పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారు. అదే విధంగా సౌత్‌జోన్ రాష్ట్ర స్థాయి పోటీలకు లతాశ్రీ(9 వతరగతి)52 కేజీలు, ప్రియదర్శిని,అంజలి(8వతరగతి) 72 కేజీల విభాగంలో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, తర్ఫీదు ఇచ్చిన పీఈటీ చంద్రశేఖర్‌రాజును హెచ్‌ఎం భువనేశ్వరి అభినందించారు.



ఎంపికైన బాలుర పాఠశాల విద్యార్థులు

## ఉత్తమ సేవలకు ప్రశంస



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న తహసీల్దార్, ఎంఈఓ, ఎంపీడీఓ

**నగరి:** నియోజకవర్గ పరిధిలోని పలువురు అధికారులకు ఉత్తమ సేవలకు అవార్డులు అందాయి. చిత్తూరులో గణతంత్ర వేడుకల్లో వారికి జిల్లాకలెక్టర్ హరి నారాయణ్, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్‌పర్సన్ శ్రీనివాసులు, ఎస్పీ రిషాంత్ రెడ్డి అవార్డులను అందజేశారు. ఉత్తమ తహసీల్దార్‌గా చంద్రశేఖర్ రెడ్డి, ఉత్తమ ఎంపీడీవోగా చంద్రమౌళి, ఉత్తమ ఎంఈవోగా శ్రీదేవి, ఉత్తమ ఎస్‌బి కానిస్టేబుల్‌గా నగరికి చెందిన నాగరాజు, ఉత్తమ ఏఎస్‌ఐగా విజయపురానికి చెందిన ఏఎస్‌ఐ లోకనాథం, ఉత్తమ కానిస్టేబుల్‌గా నగరికి చెందిన రవి, విజయపురానికి చెందిన చెంగయ్య, ఉత్తమ హోంగార్డ్‌గా విజయపురానికి చెందిన కదిరి వేలు అవార్డులు అందుకున్నారు.



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఏఎస్ఐ, ఎస్బీ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, హోంగార్డు

## నేడు ఉద్యానవన పంటలపై అవగాహన

**కార్వేటినగరం:** ఉద్యానవన పంటలపై శనివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారిణి ఆర్.హేమలత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు కార్వేటినగరం వ్యవసాయ కార్యాలయంలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో మిరపలో విజృంభిస్తున్న పైముడత, కింద ముడత తెగుళ్ల నివారణ, సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్తలు సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. మామిడి, పూల తోటలు, కూరగా యల పెంపకం, తెగుళ్లు, సస్యరక్షణ, మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. రైతులు పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## అన్నదానానికి బియ్యం వితరణ



బియ్యం బస్తాలు అందిస్తున్న దాతలు

**వడమాలపేట:** మండలంలోని సదాశివకోనలో శ్రీకామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి రోజున అన్నదానం చేసేందుకు దాత 25 బియ్యం బస్తాలను దాతలు వితరణగా అందజేశారు. కల్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కల్లూరు సుధాకర్‌రెడ్డి, భార్య ప్రమీల శుక్రవారం తట్నేరి గొల్లపల్లె అన్నదాన ట్రస్టుకు బియ్యం బస్తాలను అందించారు. సభ్యులు మునిబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రి కిటకిట

**చిత్తూరు రూరల్:** జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. రోజుకు 200 వరకు జ్వరం, జలుబు, దగ్గు కేసులు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఆ విభాగంలోని వైద్యులు తక్షణమే వారికి తగిన వైద్యం చేస్తూ, సరైన మందులు, మాత్రలు అందిస్తున్నారు.

# ఏకం ఆలయంలో భక్తుల సందడి





అమ్మా భగవాన్‌లకు హారతి ఇస్తున్న తనయుడు కృష్ణాజీ, దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

**వరదయ్యపాళెం:** మండలంలోని ఏకం(వన్‌నెస్) ఆలయం శుక్రవారం భక్తులతో సందడిగా మారింది. తమిళనాడులోని వెస్ట్ చెన్నై ప్రాంతాల నుంచి 25వేల మందికి పైగా భక్తులు తరలి వచ్చారు. ఆలయంలోని గోల్డెన్ బాల్ వద్ద భక్తులకు అమ్మా భగవాన్ దంపతులు దర్శనమిచ్చి ఆశీస్సులు అందజేశారు. ఉదయం 8 గంటల నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. క్యూల్లో వచ్చే భక్తులకు అమ్మా భగవాన్ దంపతులు ఆశీస్సులు అందజేశారు. తొలుత ఏకం ఆలయంలో అమ్మా భగవాన్‌లకు వారి తనయుడు కృష్ణాజీ హారతులిచ్చి దర్శనాలను ప్రారంభించారు. సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి, స్థానిక ఎస్ఐ నాగార్జునరెడ్డి పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు భోజన వసతులు, ఇతర సౌకర్యాలను ఏకం ప్రతినిధులు ఏర్పాటు చేశారు. లోకా ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజీ, ప్రతినిధులు సునీల్ జీ, ఉమాపతి దాసాజీ, రుద్ర దాసాజీ, శ్రీరామ్మూర్తి దాసాజీ ఎప్పటికప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు.

## మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

**పుత్తూరు రూరల్:** మత్తు పదార్థాలకు బానిసలైతే మెదడుపై ప్రభావం చూపి మానసిక వైకల్యం ఏర్పడుతుందని స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ కృష్ణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలు–నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తుకు బానిస అయితే నమ్ముకొన్న తల్లిదండ్రులతో పాటు జీవితం నాశనమవుతుందని తెలిపారు.వివరించారు. హెరాయిన్, కొకైన్, గంజాయి వంటి మత్తు పదార్థాలు వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందని, వీటిని ఎవరైనా వాడినా, పంపిణీ చేసినా కఠిన చర్యలు తప్పవని తెలిపారు. కళాశాల పరిసరాల్లో అనుమానస్పద వ్యక్తుల సంచారం ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ కృష్ణ

## పంటల సమగ్ర సస్యరక్షణపై శిక్షణ

**నగరి:** మండలంలోని గుండ్రాజుకుప్పం గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం వ్యవసాయ అధికారులు నిర్వహించారు. వరి పంటలో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు, పురుగులు–తెగుళ్ల నివారణ చర్యలు, ఎరువులు వాడకం, నీటి యాజమాన్యం తదితరాలను రైతులకు వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పొలంలో రైతులతో శత్రుపురుగులు, మిత్ర పురుగులు గుర్తింప జేసి, పొలం పరిసరాల విశ్లేషణ, తీసుకోవలసిన జాగ్రత్తలు, సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలు, కలుపు నివారణ, పంటకోత తరువాత తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఏడీఏ సౌభాగ్య లక్ష్మి, వ్యవసాయ అధికారులు రాఘవేంద్రయాదవ్, యామిని, శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న వ్యవసాయ అధికారులు

## శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం

**కార్వేటినగరం:** పట్టు భద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి ఉద్యోగ,ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ పరిశీలకుడు వెంకటరమణారెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఆర్కేవీబీపేట సచివాలయ ఆవరణంలో ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి కుమార్తె, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కె.కృపాలక్ష్మి, ఎంపీపీ లత ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రులతో కలసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. అనంతరం ఎంఎం విలాసం, అన్నూరు, ఆలత్తూరు, కత్తెరపల్లె, గాజంకి, అమ్మపల్లె, సీడీ కండ్రిగ సచివాలయాల పరిధిలో పర్యటించి ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రులను కలిసి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, నాయకులు శేషాద్రి, శేఖర్‌రాజు, చందురాజు, ధనశేఖర్‌వర్మ, పురంధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకటరమణారెడ్డి, బాలాజీ

## ఘనంగా గెరిగ ఊరేగింపు

**వెదురుకుప్పం:** మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ దాసరి కాలనీలో ఓం శక్తి పూజలు పది రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం ఓం శక్తి మాలధారణ భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పచ్చికాపల్లం గ్రామ వీధుల్లో పాటు దాసరికాలనీలో గెరిగను ఊరేగించారు. ఇంటింటి వద్ద కర్పూర హారతులు సమర్పించారు. పచ్చికాపల్లం గ్రామంతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల్లో ఉన్న ఓం శక్తి మాల ధరించిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దాసరి కాలనీలో సుమారు వంద మంది మహిళలు ఓం శక్తి మాల ధరించి పూజలు నిర్వహిస్తున్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

# అవార్డు గ్రహీతలకు సన్మానం



నగరి: ఎంఈఓ శ్రీదేవికి సన్మానం



పాలసముద్రం: సన్మానం అందుకున్న ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్

**నగరి:** రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డు అందుకున్న ఎంఈవో శ్రీదేవిని ఉపాధ్యాయులు సత్కరించారు. శుక్రవారం మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం ప్రాథమిక పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు హరిదాస్, ఉపాధ్యాయులు మోహన్ రాజ్, మెహర్నిషా, మణి, సురేష్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

**పాలసముద్రం:** రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవ ప్రశంసాపత్రం అందుకున్న ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్‌ను శుక్రవారం బలిజకండ్రిగ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఉపాధ్యాయుల బృందం సన్మానించింది. మండల పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**గంగాధరనెల్లూరు:** డీసీసీబీ జీడీనెల్లూరు బ్రాంచ్ మేనేజర్ మహేష్‌ను శుక్రవారం బ్యాంకు సిబ్బంది, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రిపబ్లిక్‌డే సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న సందర్భంగా సన్మానించారు. వేపంజేరి ఎంపీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి, జనరల్ సెక్రటరీ రమేష్, సూపర్‌వైజర్ విజయ, సిబ్బంది పాల్గొన్నారు.

**కార్వేటినగరం:** మండలంలోని డీఎంపురం జెడ్పీ హైస్కూల్ జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులును శుక్రవారం ఉపాధ్యాయ బృందం సన్మానించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డును అందుకున్నందుకు అభినందన సభ నిర్వహించారు.

**వెదురుకుప్పం:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నుంచి ఉత్తమ టీచర్‌గా ప్రశంసాపత్రం అందుకున్న మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయురాలు శ్యామలకు ఘన సన్మానం జరిగింది. హెచ్‌ఎం ఎం. వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె సేవలను కొనియాడారు.



వెదురుకుప్పం : అభినందిస్తున్న హెచ్‌ఎం



జీడీనెల్లూరు: బ్యాంకు మేనేజర్ మహేష్‌కు సత్కారం



కార్వేటినగరం : శ్రీనివాసులుకు సన్మానం